# భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూ సర్వే
## ప్రవేట్ వ్యక్తుల మధ్య పంచాయతీలో తలదూర్చం

- భూమే ప్రమాణికంగా భూ సర్వే జరుగుతుంది. వరి పొలాల గట్ట పై నడుస్తూ...
- రైతులకు అవగాహాన కల్పించారు.
- కొంగర భూ సర్వే ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్.



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 25 ప్రజా జ్యోతి :** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూ సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్. పేర్కొన్నారు. మండలం లోని

మిగతా 2 లో...



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
శనివారం | 26 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 7



- ఆధార్ అవసరం లేదట.. డబ్బులు పంపిస్తే బస్తాలు సిద్ధమట!
- ఏఈఓ హామీలపై కౌలు రైతుల ఆరోపణలు.. సేల్స్‌మన్ పాత్రపైనా ప్రశ్నలు
- బచ్చోడు నుంచి బీరోలు, ఎలువారి గూడెం వరకు బయటకొస్తున్న బాధితుల గోడు.

# యూరియా బస్తాకు ఓ హామీ.. ఫోన్‌పేకు మరో దారి!

**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 25 (ప్రజాజ్యోతి):** యూరియా కోసం రైతు పొలంలో వెతకాల్సిన అవసరం లేదట.. గోదాములో ఉందో లేదో చూసుకోవాల్సిన పనీ లేదట.. ఆధార్ కార్డు అవసరం కూడా లేదట! కావాల్సిన బస్తాల సంఖ్య చెప్పాలి..డబ్బులు ఫోన్‌పే చేయాలి.. ఆ తర్వాత వచ్చి యూరియా తీసుకెళ్లాలట! ఇదంతా తమకు చెప్పినట్లు బచ్చోడు గ్రామానికి చెందిన ఓ కౌలు రైతు ఆరోపిస్తుండటంతో వ్యవసాయ శాఖలో యూరియా పంపిణీ తీరుపై కొత్త ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. ఏఈఓ బానోత్ కళ్యాణ్‌తో జరిగిన ఫోన్ సంభాషణకు సంబంధించిన ఆడియో తన వద్ద ఉందని ఆ కౌలు రైతు చెబుతున్నాడు. యూరియా కావాలని అడిగినప్పుడు తన పరిధిలో కొన్ని బస్తాలు ఉన్నాయని, ఎన్ని కావాలో చెప్పాలని, ఆధార్ అవసరం లేదని, డబ్బులు ఫోన్‌పే చేస్తే తరువాత వచ్చి బస్తాలు తీసుకెళ్లవచ్చని చెప్పినట్లు అతడి ఆరోపణ. ఆడియోను సంబంధిత వ్యక్తి వినిపించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ.. అందులోని స్వరాలు, సంభాషణ సందర్భం,లావాదేవీల వాస్తవికత అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది.

**'లెక్క' ఎక్కడుంది.. రైతుకే తెలియాలి!**

యూరియా పంపిణీకి సాధారణంగా రైతుల వివరాలు, నిల్వలు, పంపిణీ నమోదు వంటి అంశాలకు

మిగతా 6 లో...

# అంధకారంలో బోనకల్ ఫ్లైఓవర్



2 లో...

- ఫ్లై ఓవర్ పై విద్యుత్ లైట్లకు మోక్షం ఎన్నడు.?
- చీకటిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- ఫ్లై ఓవర్ పై ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి.?
- విద్యుత్ దీపాలు, మెట్లకు మోక్షం రావడం లేదు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- గత పాలకులు పట్టించుకోలేదు
- ప్రస్తుత పాలకులు అయినా కనికరం చూపుతారా.?
- భట్టి సార్ విద్యుత్ లైట్లు, మెట్ల సమస్యను పరిష్కరించండి
- ముక్తకంఠంతో కోరుతున్న మండల ప్రజలు

# వర్షం సృష్టించిన బీభత్సం

- గ్రామాల్లో ఇళ్లల్లోకి చేరిన వరద నీరు , విరిగి పడిన చెట్లు



2 లో...

# రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ప్రమాద ప్రాంతాల్లో తక్షణ,దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలి
- జాయింట్ ఇన్‌స్పెక్షన్ సిఫార్సుల అమలుకు అధికారుల బాధ్యతలు నిర్దేశించాలి
- రోడ్డు భద్రతా సామగ్రి కొనుగోలులో ప్రమాణాలు, స్పెసిఫికేషన్లు పరిశీలించాలి
- ప్రతి రోడ్డు ప్రాంతంలో చేపట్టిన చర్యలకు ముందు, తర్వాత ఫొటోలతో నివేదిక సిద్ధం చేయాలి
- శ్రీశ్రీ సర్కిల్ వద్ద ప్రమాదాలు నియంత్రించేందుకు కార్యాచరణ ప్రణాళిక
- రోడ్డు భద్రతపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో రోడ్డు భద్రతపై సమీక్షించారు.జిల్లాలోని వివిధ ప్రమాదకర, సున్నితమైన రహదారి ప్రాంతాల పరిస్థితిని జిల్లా కలెక్టర్ సమీక్షించి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, రోడ్డు భద్రతకు అవసరమైన సామగ్రి, పరికరాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఇతర జిల్లాల్లో

మిగతా 2 లో...

## భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూ సర్వే ప్రవేట్ వ్యక్తుల మధ్య పంచాయతీలో తలదూర్చం



(మొదటి పేజీ తరువాయి...)

కొంగర గ్రామంలో జరుగుతున్న భూ సర్వే ను శుక్రవారం పరిశీలించారు. వరి పొలాల బురదలో గట్ల పై నడుస్తూ రైతుల వద్దకు వెళ్లి సర్వే పై అవగాహన కల్పించారు. రైతులు అడిగిన పలు సందేహాలకు, అనుమానాలకు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన .మాట్లాడారు..భూ సర్వేలో భూవివాదాలకు చెక్ పడుతుందన్నారు. .భూమి ఎంత ఉందో... అంతే లెక్క అన్నారు. సర్వేకు భూమే ప్రమాణికం అన్నారు. ఈ సర్వే వలన వెయ్యిళ్లే వరకు కూడ లెక్క మార దన్నారు. రైతులకు మ్యాఫ్ పట్టాలు అందిస్తామన్నారు. ప్రవేట్ వ్యక్తుల మధ్య పంచాయతీ లో అధికారులు తలదూర్చమని పేర్కొన్నారు. ఏదైనా ఉంటే వారే సమన్వయం చేసుకుని పరిష్కారం చేసుకోవాలని సూచించారు. భూమి ని బట్టి సర్వే జరుగుతుందని అన్నారు. సర్వే సమయంలో ప్రతీ రైతు ఉండాలని సూచించారు. సర్వే పూర్తిగా రైతుల సమక్షంలో ఉంటుందన్నారు. రైతులకు నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. రోపర్, ట్యాబ్ తదితర ఆధునిక సాంకేతిక పరికరాలతో డిజిటల్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో సెంటు భూమి కూడ తప్పులు జరగదన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ పరాస్కుమార్, సర్వేయర్ ఏడీ రాజేందర్, నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్, మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్ ఆలస్యం మధుసూధన్రావు పాల్గొన్నారు.

## వర్షం సృష్టించిన బీభత్సం



**వేంసూర్ సెప్టెంబర్ 25 ప్రజాజ్యోతి** మండలంలో గత రెండు రోజులుగా కురిసిన వర్షం కారణంగా గ్రామాల్లో ఇళ్లల్లోకి నీళ్ళు చేరాయి కుండపోత కురిసిన కారణం గా వాగులు వంకలు పొర్లాయి అనేక చోట్ల చెట్లు విరిగిపడ్డాయి కరెంటు స్తంభాల నెలకొరిగాయి రోడ్లన్నీ జలమయ్యాయి రహదారులు కనిపించకుండా పోయాయి మండలంలో ఈ వర్షాకాలం మొత్తం మీద బుధ గురువారాల్లో కురిసిన వర్షం కొంత నష్టాన్ని మిగిల్చింది ప్రకృతి విలయతాండవం చేసింది కొన్నిచోట్ల చెట్లు విరిగిపడ్డాయి పందిరిలు గాల్లోలేచాయి ఎప్పుడు నుంచి వర్షం కోసం ఎదురుచూస్తున్నారు రైతుల్లో కొంత ఆనందం కలిగిన ఈ పకృతి విలయతాండవల్ల కొన్ని గ్రామాల్లో చాలావరకు నష్టాన్ని మిగిల్చవెళ్ళింది గ్రామాల్లో నీరు చేరి రెండు రోజులు వరకు అలాగే నిలిచిపోయాయి సహాయక చర్యల్లో ఆయా గ్రామాల సర్పంచులు నిమగ్నమయ్యారు . గత రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో వరద నీరు చేరింది. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి లింగపాలెం, భీమవరం గ్రామాల్లో నీటి ప్రవాహం ఉధృతమైంది. లింగపాలెం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ మొత్తం వరద నీటితో నిండిపోయి చెరువును తలపించింది. దీంతో విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కావాల్సి వచ్చింది. పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో సర్పంచ్ యర్రా రమేష్ వెంటనే స్పందించి జేసీబీని ఏర్పాటు చేసి వరద నీటిని బయటకు పంపించే చర్యలు చేపట్టారు. అదేవిధంగా భీమవరం గ్రామంలో మూడు ఇళ్లలోకి వరద నీరు చేరడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వంట చేసుకునే పరిస్థితి లేక గురువారం రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చిందని బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ వంట్ల రమేష్ వెంటనే జేసీబీని ఏర్పాటు చేసి సైడ్ కాలువను తవ్వించి వరద నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు.భరణిపాడు గ్రామంలో ప్రధాన రహదారి చెరువును తలపించింది నీరు ఎటుపోకుండ రోడ్లుపై నిలిచి ప్రయాణికులకు ఇబ్బంది కరంగా మారింది . వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టిన సర్పంచుల తీరుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి...)

చేపట్టిన పనులకు సంబంధించిన వర్క్ ఆర్డర్లను పరిశీలించి, అక్కడ వినియోగించిన సామగ్రి స్పెసిఫికేషన్లు, ప్రమాణాలను క్రాస్ చెక్ చేసి, అదే తరహా స్పెసిఫికేషన్లతో అవసరమైన సామగ్రికి ఆర్డర్లు ఇవ్వాలని ఆదేశించారు. గత సమావేశంలో సూచించిన మేరకు ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించి, తక్షణ, దీర్ఘకాలిక చర్యలను ప్రతిపాదించాలని కలెక్టర్ సూచించారు. జాయింట్ ఇన్‌స్పెక్షన్ అనంతరం చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర కన్సాలిడేటెడ్ నివేదికను సిద్ధం చేయాలని అన్నారు. జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో చేసిన ప్రతి సిఫార్సుకు సంబంధిత అధికారుల బాధ్యతను నిర్దేశించి, ప్రతిపాదించిన చర్యలను రహదారులపై పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు భద్రతకు సంబంధించి ఇంజినీరింగ్ చర్యల్లో భాగంగా రంబుల్ స్ట్రిప్స్, పాదచారుల క్రాసింగ్ మార్కింగ్, బ్లింకర్లు, సెంటర్, ఎడ్జ్ లైన్లు, రోడ్ స్టడ్స్, అవసరమైన హెచ్చరిక సూచిక బోర్డుల ఏర్పాటును పూర్తి చేయాలని అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను నిరంతరం కొనసాగించాలని,ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు.ప్రతి రోడ్డు ప్రాంతంలో అవసరమైన భద్రతా చర్యలు చేపట్టే ముందు, చర్యలు పూర్తయిన తర్వాత ఫొటోలతో కూడిన నివేదికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారుల పరిధిలో అవసరమైన అన్ని రోడ్డు భద్రతా చర్యలను సంబంధిత ఎన్‌హెచ్ అధికారులు చేపట్టేలా సమన్వయం చేయాలని అన్నారు.ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ వరకు అవసరమైన రంబుల్



స్ట్రిప్స్ ఏర్పాటు చేసినందున రోడ్డు మార్కింగ్ పనులను కూడా పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు. శ్రీశ్రీ సర్కిల్ వద్ద క్రిస్‌క్రాస్‌గా జరుగుతున్న వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. రోడ్డు భద్రతకు సంబంధించిన పనులను అత్యంత సీరియస్‌గా చేపట్టాలని, ఒకరిపై మరొకరు నెపం మోపడం వల్ల సమస్య పరిష్కారం కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో గుర్తించిన సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపించాలని అన్నారు.రహదారులపై చేపట్టాల్సిన ప్రతి మార్పు, మెరుగుదల, భద్రతా చర్యలను ముందుగానే కాగితంపై స్పష్టంగా నమోదు చేయాలని అన్నారు. ఏ ప్రాంతంలో ఏ పని ఎందుకు చేపట్టాలి, దానికి అవసరమైన చర్యలు ఏమిటి అనే వివరాలతో ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.ప్రతి జాయింట్ ఇన్‌స్పెక్షన్‌కు సంబంధించిన రహదారి వివరాలను, సమస్య ఉన్న ప్రాంతాల ఫొటోలను, గుర్తించిన లోపాలను, అవసరమైన సిఫార్సులను పొందుపరిచి సమగ్ర నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కేవలం సమస్యలను గుర్తించడం కాకుండా, వాటికి పరిష్కార మార్గాలను కూడా నివేదికలో స్పష్టంగా సూచించాలని అన్నారు. ఖమ్మం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద అవసరమైన రెండు సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. జాతీయ రహదారులపై గుర్తించిన బ్లాక్ స్పాట్లకు సంబంధించిన డిజైన్లను తుది రూపంలో సిద్ధం చేసి, పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు.ఎస్ఆర్ గార్డెన్స్ పరిసరాల్లో రహదారి భద్రతకు,వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఉన్న నిర్మాణాలను గుర్తించి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. రోడ్డు భద్రత కోసం కొనుగోలు చేసే అన్ని రకాల సామగ్రి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తక్కువ నాణ్యత కలిగిన సామగ్రి వల్ల రోడ్డు భద్రతా చర్యల ఉద్దేశ్యం నెరవేరదని, కొనుగోలుకు ముందే నాణ్యత, స్పెసిఫికేషన్లను పూర్తి స్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాలు,ట్రాఫిక్ సమస్యలు, ఇతర భద్రతా సమస్యలను పోలీసు శాఖ క్షేత్ర స్థాయిలో గుర్తించి, వాటికి పరిష్కార మార్గాలను ప్రతిపాదించాలని కలెక్టర్ సూచించారు. సమస్యలను గుర్తించడం మాత్రమే కాకుండా, వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు,కార్యాచరణ ప్రణాళికను సంబంధిత శాఖలకు అందించాలని అన్నారు.మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తంగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ పార్కింగ్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. బెంగుళూరు, ఇతర నగరాల్లో అమలు చేస్తున్న పార్కింగ్ విధానాలను పరిశీలించి, ఖమ్మం నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో కూడా నిర్దిష్ట పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు.నిర్ణయించిన పార్కింగ్ ప్రాంతాలకు వెలుపల వాహనాలను నిలిపితే వాటిని తొలగించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఖమ్మం నగరంలోని షాపింగ్ మాల్స్, పెద్ద ఆసుపత్రులు, తదితర వాణిజ్య, ప్రజా వినియోగ సంస్థల్లో తగినంత పార్కింగ్ సదుపాయం ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు.రోడ్డుపై వాహనాలు నిలిపే పరిస్థితి ఏర్పడకుండా ఆయా సంస్థల యాజమాన్యాలతో సమన్వయం చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరంలో రోడ్‌సైడ్ పార్కింగ్ వల్ల అధిక సమస్యలు ఎదురవుతున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ సమస్య నివారణకు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ముఖ్యమైన రహదారుల పక్కన రోడ్‌సైడ్ పార్కింగ్ లేకుండా చూడాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వాహనాలు నిలపకుండా అవసరమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి రామానుజమ్,ఆర్ అండ్ బి ఎస్ ఈ యుగంధర్ రావు,జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి డా.రామారావు, జిల్లా రవాణాధికారి జగదీష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య,డిఈఓ సదానందం, ఎన్హెచ్ఏఐ పిడి దివ్య, మునిసిపల్ కమీషనర్ లు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంధకారంలో బోనకల్ ఫ్లైఓవర్

**బోనకల్, సెప్టెంబర్ 25 ( ప్రజా జ్యోతి):** బోనకల్ మండల కేంద్రంలో ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టిన నుండి అంధకారంలోనే కనిపిస్తుంది. సాయంత్రం ఆరు దాటితే చాలు ఫ్లై ఓవర్ అంతా చీకటి మయమే. భారీ వాహనాలు తిరిగే ఈ ఫ్లై ఓవర్ పై విద్యుత్ లైట్లు లేక వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చీకటి పడితే చాలు ఎప్పుడు ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి కనిపిస్తుంది. చీకటి పడితే ఈ ఫ్లైఓవర్ పై వాహనదారులు ప్రయాణించాలంటే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణించాల్సిందేనంటూ ఆవేదన చెందుతున్నారు. గతంలో ఈ ఫ్లై ఓవర్ పై ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన దాఖలాలు కూడా ఉన్నాయి.గత 15 సంవత్సరాల నుండి ఈ ఫ్లై ఓవర్ కు విద్యుత్ దీపాలు, మెట్లకు మోక్షం రావడం లేదు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలకులు, నాయకులు గానీ ఈ ఫ్లై ఓవర్ పై తిరిగారే తప్ప ఫ్లైఓవర్ సమస్యలు మాత్రం పరిష్కారం చేయలేదు. అంధకారంలో ఉన్న ఈ ఫ్లై ఓవర్ సమస్యలు తీరేది ఎన్నడని మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో ప్రభుత్వ చీఫ్ విప్ గా ఉన్నప్పుడు ఈ ఫ్లై ఓవర్ నిర్మాణమును చేపట్టారు. ఆ తరువాత 10 సంవత్సరాలు బి ఆర్ఎస్ ప్రభుత్వంలో ఈ ఫ్లై ఓవర్ గురించి పట్టించుకున్న నాధుడే లేడంటూ మండల ప్రజలు అంటున్నారు.నాటి భట్టి హయాంలో చేపట్టిన ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం నేటి డిప్యూటీ సీఎం బట్టి హాయంలోనే అభివృద్ధి చెందుతుందని మండల ప్రజలు ఆశ పడుతున్నారు. కానీ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్న ఈ బోనకల్ ఫ్లైఓవర్ కు మోక్షం కలగడం లేదు.? మధిర నియోజకవర్గంలో అంతర్గత రోడ్లు అన్ని అభివృద్ధి చెందుతున్నాయి. కానీ బోనకల్ మండల కేంద్రంలో ఉన్న ఫ్లై ఓవర్ మాత్రం ఎందుకు అభివృద్ధి చెందడం లేదంటూ ప్రజల్లో నడుస్తున్న చర్చ.? చీకటిమయంలో ఉన్నా ఈ ఫ్లై ఓవర్ పై విద్యుత్ దీపాలు లేక ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఫ్లై ఓవర్ పై విద్యుత్ దీపాలు, మెట్ల కొరతకు మోక్షం ఎన్నడూ అంటూ మండల ప్రజలు, వాహనదారులు అంటున్నారు. విద్యుత్ దీపాలు వేసేది ఎన్నడు, ఈ ఫ్లై ఓవర్ రూపురేఖలు మారేది ఎన్నడు, వాహనదారుల సమస్యలు తీరేదెన్నడు అంటూ మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. చీకటిమయం లో కనిపిస్తున్న ఈ ఫ్లై ఓవర్ పై ఈ తిప్పలు తప్పవా అంటూ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రాత్రిపూట ఈ ఫ్లైఓవర్ పై ప్రయాణించాలంటే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణించాల్సిందే అంటూ మండల ప్రజలు అంటున్నారు. దీనికి తోడు ఈ ఫ్లై ఓవర్ పై ఆర్ అండ్ బి అధికారుల వైఫల్యంతో పరిశుభ్రత కూడా లోపించి అధ్వానంగా కనిపిస్తుంది. ఎన్నడూ కూడా ఆర్ అండ్ బి అధికారులు ఈ ఫ్లై ఓవర్ పై పరిశుభ్రతను చూసిన దాఖలాలు లేవంటూ మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇంకా ఎన్నిరోజులు పడాలి ఈ బాధలని మండల ప్రజలు అంటున్నారు. ఇకనైనా అధికారులు, నాయకులు స్పందించి చీకటి మయంగా ఉన్నా ఈ ఫ్లై ఓవర్ పై విద్యుత్ లైట్లు, మెట్లు అమర్చే విధంగా కృషిచేయాలని మండల ప్రజలు, వాహనదారులు ముక్తకంఠంతో కోరుతున్నారు. వీటన్నిటికి తోడు ఫ్లై ఓవర్ పై పరిశుభ్రత లోపించడంలో ఆర్ అండ్ బి అధికారుల వైఫల్యం కనిపిస్తుందని మండల ప్రజలు బహిరంగంగానే అంటున్నారు. ఇకనైనా డిప్యూటీ సీఎం బట్టి సార్ మండల ప్రజల బాధలను ఆలకించి మీ మంచి మనసుతో బోనకల్ ఫ్లైఓవర్ పై జర దృష్టిసారించి ఫ్లై ఓవర్ పై ప్రమాదాలు జరగకుండా విద్యుత్ లైట్లు, మెట్ల కొరతను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# శ్రీమంతా హాస్పిటల్ ఖమ్మంలో జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి ఆకస్మిక తనిఖీ





- **డాక్టర్ డి రామారావు**

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం పట్టణంలోని శ్రీమంతా హాస్పిటల్, సాయి మారుతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లను, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు సందర్శించినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హాస్పిటల్లో అందిస్తున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న చికిత్సా విధానం, ఆసుపత్రి నిర్వహణ, రిజిస్టర్లు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలు, వార్డులు, ప్రయోగశాల, ఫార్మసీ తదితర విభాగాలను పరిశీలించి, అవసరమైన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్లో క్లినికల్ ఇష్టబ్లిషమెంట్స్ యాక్ట్ , 2010,సంబంధిత నిబంధనల ప్రకారం అవసరమైన రికార్డులు, అనుమతులు, వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది అర్హత ధ్రువపత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సూచించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, రోగుల భద్రత మరియు ప్రజారోగ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అదేవిధంగా ప్రజలకు అందించే వైద్య సేవ ల్లో నాణ్యతా ప్రమాణాలు, పారదర్శకత, రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ డి. రామారావు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించిన పక్షంలో సంబంధిత చట్టాలు మరియు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన స్ప ష్టం చేశారు. ప్రో గ్రాం ఆఫీసర్ డాక్టర్ బిందు శ్రీ, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ మోతియా, డాక్టర్ ఐ మూ ర్తి, జూనియర్ అసిస్టెం ట్ రాజేం దర్, డీఈవో రాజేష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎన్నికల్లో ఐఎన్ టియుసి బలపరిచిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

- **జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఆర్టీసీ ఎన్నికల్లో ఐ ఎన్ టి యు సి బలపరిచిన అభ్యర్థుల విజయానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పిలుపునిచ్చారు. స్థానిక సంజీవరెడ్డి భవన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో అర్బన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, జిల్లా ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు కొత్త సీతారాములు మాట్లాడుతూ అక్టోబర్ 9న జరగనున్న ఆర్టీసీ ఎన్నికల్లో ఐ ఎన్ టి యు సి బలపరిచిన అభ్యర్థుల విజయానికి జిల్లా, నగర మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9:30 గంటలకు ఖమ్మం బస్ డిపో వద్ద ఐ ఎన్ టి యు సి జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా, నగర, మండల కాంగ్రెస్ నాయకులతో పాటు ఐ ఎన్ టి యు సి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించనున్న ఆర్టీసీ ఎన్నికల సన్నాహక సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎన్నికల కార్యాచరణపై చర్చించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నగర ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు నరేష్ మోహన్ నాయుడు, ఆర్టిసి ఐ ఎన్ టి యు సి నాయకులు హనుమంతరావు, వినోదరావు, ఉపేందర్ రెడ్డి, వీరభద్రరావు, యాదగిరి, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

- **జిల్లాస్థాయి పోటీలలో విద్యార్థుల ఉత్సాహం**




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** తెలంగాణ టూరిజం డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఏ ఎస్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు ఘనంగా నిర్వహించారు. జిల్లా టూరిజం ఆఫీసర్ సుమన్ చక్రవర్తి ఆధ్వర్యంలో, డీఐఈఓ రవి బాబు ముఖ్య అతిథిగా, కళాశాల ప్రిన్సిపాల్ గోవింద రావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

### ›› ముఖ్య అతిథుల ప్రసంగాలు

జిల్లా టూరిజం ఆఫీసర్ సుమన్ చక్రవర్తి మాట్లాడుతూ, స్మారక కట్టడాలు, చారిత్రాత్మక కట్టడాలు భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీఐఈఓ రవి బాబు మాట్లాడుతూ, ఖమ్మం ఖిల్లా, నేలకొండపల్లి బౌద్ధ స్తూపం ఎంతో గొప్ప చరిత్ర కలిగి ఉన్నాయని, పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రిన్సిపాల్ గోవింద రావు మాట్లాడుతూ, రామప్ప వంటి దేవాలయాలు మన శిల్పకళకు నిదర్శనమని, యునెస్కో గుర్తింపు పొందడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. పాల్గొన్న కళాశాలలు ఈ పోటీలలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల నుండి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏ ఎస్ ఆర్ జిజేసీ శాంతినగర్, జి జె సి నయాబజార్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఖమ్మం, జి జె సి ముదిగొండ, జి జె సి కూసుమం చి, టి జి ఎస్ సోషల్ వెల్ఫేర్ కూసుమంచి, టిఎంఆర్జెసి ఖమ్మం, అంబేద్కర్ కాలేజ్ ఆఫ్ సి ఓ ఈ ఫర్ గర్ల్స్, సర్వజ్ఞ జూనియర్ కళాశాల, రెజోనెన్స్ జూనియర్ కళాశాల ఖమ్మం తదితర కళాశాలల విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. ఏ ఎస్ ఆర్ కళాశాల సిబ్బంది కృషితో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

### ›› బహుమతి ప్రధానోత్సవం:

విజేతలకు ఈ నెల 27వ తేదీ ఆదివారం సాయంత్రం లకారం చెరువు ట్యాంక్ బండ్ వద్ద జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

## జర్మన్ భాష శిక్షణ కోసం పేర్లు నమోదు చేసుకోవాలి

- **జిల్లా ఉపాధి అధికారిణి మాధవి**

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** నర్సింగ్, ఫిజియోథెరపిస్ట్ కోర్సులు పూర్తి చేసిన ఖమ్మం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచితంగా జర్మన్ భాష శిక్షణ జిల్లా ఉపాధి కార్యాలయంలో టామ్ కామ్ ఆధ్వర్యంలో అందించనున్నామని, ఆసక్తి గల వారు జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్మన్ భాషా శిక్షణ అనంతరం నిర్వహించిన పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు జర్మనీలో షరతులతో కూడిన ఉద్యోగ ఎంపిక ధృవీకరణ పత్రం అందించబడుతుందని, మరిన్ని వివరాలకు కలెక్టరేట్ లోని జిల్లా ఉపాధి అధికారిణి కార్యాలయంలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారిణి మాధవి ఆ ప్రకటనలో తెలిపారు.

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఘనంగా ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 3:00 గంటలకు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిడాక్టర్ డి. రామారావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వేణు మాధవ రావు హాజరై, జిల్లా వ్యాప్తంగా సేవలందిస్తున్న ఫార్మసిస్టులందరికీ ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఔషధాలను అందించడంలో, మందుల సరైన వినియోగంపై రోగులకు అవగాహన కల్పించడంలో, మందుల భద్రతా ప్రమాణాలను పాటించడంలో ఫార్మసిస్టులు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మొత్తం ఆరోగ్య రక్షణ వ్యవస్థలో ఫార్మసిస్టుల సేవలు ఎంతో విలువైనవని పేర్కొంటూ, ప్రజారోగ్య పరిరక్షణలో వారు మరింత అంకితభావం, బాధ్యతాయుతమైన దృక్పథంతో పనిచేయాలని సూచించారు. ఈ వేడుకల్లో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రభుత్వ ఫార్మసిస్టులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా నిమజ్జనం



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 25 ప్రజాజ్యోతి:** మండలంలోని వివిధ గ్రామాలలో వినాయక విగ్రహాల నిమజ్జనం మూడో రోజు కూడ అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాయగూడెం, నేలకొండపల్లి, చెరువుమాధారం తదితర గ్రామాలలో వినాయక ఉత్సవ కమిటి ప్రతినిధులు అత్యంత వైభవంగా నిమజ్జన కార్యక్రమం చేశారు. రాయగూడెం గ్రామంలో సర్పంచ్ బోయిన వేణు ఆధ్వర్యంలో ఆటా, పాటలతో ఉత్సవం విజయవంతంగా ముగించారు. నిమజ్జన కార్యక్రమంను తహాశీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎస్సై శ్రీనివాస రెడ్డి లు పర్యవేక్షించారు.

## కొత్తూరు గ్రామ ప్రజల యోగక్షేమమే ముఖ్యం పాలకవర్గం



**సత్తుపల్లి సెప్టెంబర్25(ప్రజా జ్యోతి)** ఇటీవల కురిసిన వర్షాలకు కొత్తూరు గ్రామంలో ఇందిరమ్మ రేవంత్ రెడ్డి కాలనీలో వరద నీరు చేరటంతో సర్పంచ్ అయినంపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొర్లమారి రామ్మోహన్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు అందరూ కలిసి వరద నీటిని , చెత్తను గ్రామపంచాయతీ సిబ్బందితో పూర్తిగా తొలగించారు. నీరు నిలవలేకుండా సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకొని, గ్రామస్తులకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో కొత్తగా నిర్మించిన పెద్ద డ్రైనేజీ ద్వారా వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని, ఎవరు ఆధైర్య పడవద్దు అని కొత్తూరు గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని వారికి వివరించారు. ఈ విధంగా వర్షం పడిన వెంటనే పాలకవర్గం స్పందించడం పట్ల, కాలనీవాసులు , గ్రామస్థులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## మాజీ సర్పంచ్ భర్తతో ప్రాణహాని ఉంది

- తనకు రక్షణ కల్పించాలని బజ్జాతండ సర్పంచ్ వేడుకోలు



**కారేపల్లి, సెప్టెంబర్ 25, ప్రజా జ్యోతి:** మాజీ సర్పంచ్ భర్త నుంచి తనకు ప్రాణహాని ఉందని సింగరేణి మండల బజ్జాతండ ప్రస్తుత సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు ఆరోపించారు. సింగరేణి మండల కేంద్రంలో గ్రామ పెద్దలతో కలిసి శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ సర్పంచుగా గెలిచినప్పటి నుండి ఏడాదికాలంగా తను ఎదుర్కొంటున్న ఇబ్బందులను మీడియాకు వివరించారు. సర్పంచుగా తన గెలుపు,రాజకీయ విభేదాలు, గ్రామపంచాయతీ ప్రజల ఆదరణ నేపథ్యంలో తనపై ఒత్తిళ్లు,బెదిరింపులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.మాజీ సర్పంచ్ భర్త బిఆర్ఎస్ నాయకులు బానోత్ రాందాస్ తో పాటు అతని అనుచరులతో తనకు ప్రాణహాని ఉందని, ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే అందుకు ఆయనే బాధ్యత వహించాల్సి ఉంటుందని సర్పంచ్ తెలిపారు.తనకు,తన కుటుంబ సభ్యులకు భద్రత కల్పించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా అధికారులు,పోలీసులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. తనకు ఎదురవుతున్న పరిస్థితులపై సర్పంచ్ భార్య వాంకుడు విజయ పోలీస్ స్టేషన్లో, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఉపసర్పంచ్ భూక్య మోహన్ రావు,గ్రామస్తులు అజ్మీర నారాయణ మాజీ ఎంపీటీసీ, జరుపుల రామారావు, హట్కర్ మంగ్య, మాలోతు లాలు,వాంకుడోత్ గన్యా, అజ్మీర హేమలానాయక్,అజ్మీర నరేన్, అజ్మీర రవి,అజ్మీర కిషోర్ నాయక్,శంకర్, అజ్మీర సామ్య హట్కర్ మంగ్య తదితరులు పాల్గొన్నారు.

## దీనదయాళ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 25 ప్రజా జ్యోతి :** పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని బీజెపీ జిలా నాయకులు ఇంగువ రామకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం దీనదయాళ్ జయంతి కార్యక్రమం ను నిర్వహించారు. ఆయన చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడా రు...భారతీయ జనసంఘ్ వ్యస్థాపకులు పండిట్ దీనదయాళ్ జీవితం ఆదర్శనీయం అన్నారు. అంత్యోదయ, ఏకాత్మ మానవతావాదం అనే సిద్ధాంతాలతో దేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు అన్నారు. ఆయన ఆశయాల సాధన కు ప్రతీ కార్యకర్త సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్, నాయకులు షేక్ షర్ఫుద్దీన్. మల్లెబోయిన గోవిందరావు, పురాణం దివాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం. బాజా రామకృష్ణ, నున్నా వెంకయ్య, రావెళ్ల మురళీ, పిట్టల సూరిబాబు, సూరేపల్లి అనసూయమ్మ, వీరునాయక్, ఏపూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులను పరిశీలించిన డీఈఈ పొట్టయ్య



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 25 ప్రజా జ్యోతి :** మండలంలోని వివిధ గ్రామాలలో చెరువుల ను నీటిపారుదల శాఖ డీఈఈ పొట్టయ్య శుక్రవారం పరిశీలించారు. మండలం లోని చెరువుమాధారం చెరువు, అనాసాగారాం, ముజ్జుగూడెం, నేలకొండపల్లి కట్టలమ్మ చెరువు, నాచేపల్లి, రాయగూడెం ఎత్తిపోతుల పధకం ను పరిశీలించారు. నీటి మట్టం పరిశీలించిన తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...చెరువుమాధారం చెరువు పూర్తి స్థాయి లో నిండిందన్నారు. 7.2 అడుగులకు గాను... ప్రస్తుతం 8.2 అడుగులకు చేరిందన్నారు. దీంతో డీవీఆర్ కెనాల్ కు 600 క్యూసెకుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ' ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ జేఈ లు మధీనా, యం. రుత్విన్రెడ్డి, కె.దీక్షిత తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పిఆర్ టియు పోరాడుతూనే ఉంటుంది

- పీఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు





**బోనకల్ , సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి):** ఉద్యోగుల సమస్యల పరిష్కారం జరిగేంతవరకు పీ ఆర్టియు పోరాడుతూనే ఉంటుందని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు తెలిపారు. బోనకల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన ఆ సంఘ మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో తమ సంఘానికి ప్రత్యేకమైన చరిత్ర ఉందన్నారు. పెండింగ్ డిఏలు పిఆర్సి ప్రకటించేంతవరకు అలుపెరగని పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని సూచించారు. సర్వసభ్య సమావేశంలో ఎంఈఓ దామాల పుల్లయ్య మాట్లాడుతూ... ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ఉద్యోగ సంఘాల పాత్ర కీలకమైందని తెలిపారు. మండల పరిధిలో సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే జాప్యం లేకుండా పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు రాష్ట్ర జిల్లా నాయకులు గుత్తా శ్రీనివాసరావు, రేగళ్ల బ్రహ్మారెడ్డి రత్నకుమార్, కాంతారావు, కొనకంచి రామ్మోహన్ పాల్గొన్నారు.

### ›› పి ఆర్ టి యు నూతన మండల కమిటీ ఎన్నిక

సమావేశం అనంతరం నూతన పిఆర్టియు మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా గంటెల ఝాన్సీ, ప్రధాన కార్యదర్శిగా మద్దినేని వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. మండల కమిటీ సభ్యులుగా దుర్గాప్రసాద్,కొనకంచి రామ్మోహన్, బంధం కొండలరావు,సిహెచ్ విద్యాసాగర్, అరిగెల నరసింహారావు, ఒరుగు గంగరాజు, షేక్ సుభాని, మంగతాయి ఎన్నిక కాబడ్డారు.

## ఐఎన్‌టీయూసీ బలోపేతానికి నూతన అసిస్టెంట్ పిట్ సెక్రటరీల ఏర్పాటు

- ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ కోటి ఆధ్వర్యంలో పరిచయ కార్యక్రమం



**సత్తుపల్లి సెప్టెంబర్25(ప్రజా జ్యోతి)** సెక్రటరీ జనరల్, మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డా. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఐఎన్‌టీయూసీ యూనియన్‌ను మరింత బలోపేతం చేసే దిశగా సత్తుపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జేవీఆర్ ఓసీలో నూతనంగా నియమితులైన అసిస్టెంట్ పిట్ సెక్రటరీలను శుక్రవారం పరిచయం చేశారు.జేవీఆర్ ఓసీ పిట్ సెక్రటరీ సీతారామరాజు అధ్యక్షతన నిర్వహించిన, ఈ కార్యక్రమంలో నూతనంగా నియమితులైన అసిస్టెంట్ పిట్ సెక్రటరీలను జేవీఆర్ ఓసీ ఎస్ఓఎం బెజ్జంకి రాజేశ్వరరావుకు పరిచయం చేయడం జరిగింది.నూతనంగా నియమితులైన అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు:కె. శ్రీధర్ – ఈపీ ఆపరేటర్,జగదీష్ మరాటి – సీనియర్ మైనింగ్ సర్దార్,ఐ.వి. రెడ్డి – ఈపీ ఆపరేటర్,ఎం. సందీప్ – ఈపీ ఆపరేటర్, సి.హెచ్. రాంప్రసాద్ – ఈపీ ఆపరేటర్,వీరిని అసిస్టెంట్ పిట్ సెక్రటరీలుగా నియమిస్తూ జేవీఆర్ ఓసీ ఎస్ఓఎం బెజ్జంకి రాజేశ్వరరావుకు పరిచయం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ మురళీకృష్ణ, ఇక్బాల్ పాల్గొన్నారు.

## డ్రైనేజ్ సమస్యను పరిష్కరించండి

- బోనకల్ ఉప సర్పంచ్ బానోత్ కొండకు వినతి పత్రం అందజేసిన గ్రామస్తులు
- త్వరలోనే మీ సమస్యను పరిష్కరిస్తాను
- బోనకల్ ఉపసర్పంచ్ బానోత్ కొండ



**బోనకల్, సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి):** బోనకల్ గ్రామంలోని చెన్న లక్ష్మాద్రి, మోర్ల వెంకటేశ్వర్లు ఇండ్ల వద్ద డ్రైనేజీ ఏర్పాటు చేయకపోవటం వలన ఇండ్లలో వాడిన నీళ్లు, వర్షపు నీరు సరఫరా కాకుండా ఇండ్ల ముందు ఆగిపోవుటవలన అక్కడ నీళ్లు నిలవ ఉండుటవలన దుర్వాసన , దోమలు పెరుగుతున్నాయని అక్కడ డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేసి మా సమస్యను పరిష్కారం చేయాలని శుక్రవారం చెన్న లక్ష్మాద్రి, మోర్ల రాజేష్ బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండా కి వినతి పత్రం అందజేశారు. ఉప సర్పంచ్ బానోతు కొండ మాట్లాడుతూ... సాధ్యమైనంత త్వరలో మీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో తెల్లాకుల శ్రీనివాసరావు ఉన్నారు.

## జర్నలిస్ట్ గోపికి కాంగ్రెస్ నేతల పరామర్శ



**కల్లూరు, సెప్టెంబర్ 25:** ప్రజా జ్యోతి కల్లూరు పట్టణానికి చెందిన ప్రముఖ దిన పత్రిక సీనియర్ జర్నలిస్ట్ గంగుల గోపిని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. ఇటీవల కుడి కాలికి హైదరాబాదులో శాస్త్ర చికిత్స చేయించుకున్న గోపి ప్రస్తుతం వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపి నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సాధారణ జీవనం సాగించాలని ఆకాంక్షించారు. పరామర్శించిన కాంగ్రెస్ కాంగ్రెస్ నాయకులు లక్కినేని కృష్ణ, కాటేపల్లి కిరణ్, పెద్ద బోయిన శ్రీను, ఏనుగు సత్యంబాబు, పాప బత్తిన నగేష్, బైర్ల కాంతారావు, తురావలి, తోట సుబ్బారావు ఆళ్లకుంట నరసింహారావు పరిమి భరత్, కుంచాల వీరయ్య, ఖమ్మం పాటి పుల్లా చారి తదితరులు పాల్గొన్నారు.

## మూగజనుల వార్షికోత్సవం, రేబిస్ అవగాహన సదస్సు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** వి.వి.పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూగజనుల, రేబిస్ అవగాహన సదస్సు మూగజనుల వారోత్సవాలు,రేబిస్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వి.వి.పాలెం జిల్లా పరిషత్ హైస్కూలు నందు విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎ.అరుణాదేవి,జిల్లా సైకియాట్రిస్ట్ డాక్టర్ ఎం.డి.సోహెల్ ముఖ్య వక్తలుగా హాజరై విద్యార్థులకు మూగజనుల సమస్యలు, పట్ల సమాజం చూపాల్సిన సానుభూతి, అలాగే రేబిస్ వ్యాధి లక్షణాలు,నివారణా చర్యలు మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అసంక్రమిత వ్యాధుల సమన్వయాధికారి ఎన్.సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమన్నారాయణ,కె.ఎన్. చారి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎస్ బీఐటీలో ఘనంగా గణేష్ నిమర్జన వేడుకలు





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక ఎస్. బీ. ఐ. టీ కళాశాలలో గణేష్ నిమర్జన వేడుకలు శుక్రవారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు. మొదట విద్యార్థులు అధ్యాపకులు, సిబ్బంది సమక్షం లో గణేష్ శోభా యాత్ర ను నిర్వహించి తదనంతరం నిమర్జన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విఘ్నాలను తొలగింగే విఘ్నేశ్వరుడును భక్తి శ్రద్ధలతో సాగనంపడం మన ఆచారమని తెలిపారు.కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డా ధాత్రి మాట్లాడుతూ తొమ్మిది రోజులు పూజలందుకున్న గణనాధుడు ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నారు. గత సంవత్సరం ఖమ్మం పట్టణం ఇదే సమయంలో ఎదుర్కున్న వరద విపత్తులును గుర్తు చేసుకుంటూ ఆ గణేషుడి దీవెనలతో ఖమ్మం ప్రజలు ఈ సంవత్సరం అయినా సుఖ సంతోషాలతో ఉండాలని కళాశాల వైస్ చైర్మన్ కే.శ్రీ చైతన్య వేడుకున్నారు.శోభా యాత్ర లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయని కళాశాల ప్రిన్సిపాల్ డా జి.రాజ్ కుమార్ తెలిపారు. విద్యార్థులు అధ్యాపకులు భక్తి ప్రపత్తులతో శుభ యాత్ర లో పాల్గొన్నారని,నిమర్జన కార్యక్రమాలలో అధిక సంఖ్యలో పాల్గొని ఆ గణనాధునికి వీడుకోలు పలికారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలం కార్యక్రమంలో కళాశాలకు చెందిన ఈ. సి. ఈ విభాగం వారు 21,000 రూపాయలకు దక్కించుకున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్, డా ఏ. వి. వి.శివ ప్రసాద్, గంధం శ్రీనివాస్, వివిధ విభాగపు అధినేతలు, అధ్యాపకులు,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యకర జీవనం.. సీడీపీఓ నిర్మల జ్యోతి

- చిన్న కోరుకొండిలో పోషణ మాస ఉత్సవాలు



**కల్లూరు, సెప్టెంబర్ 25 : ప్రజా జ్యోతి** కల్లూరు మండలం చిన్న కోరుకొండ సెక్టార్ పరిధిలోని చిన్న కోరుకొండ గ్రామపంచాయతీ అంగన్వాడీ కేంద్రాల్లో 9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సామూహిక శ్రీ మంతాల వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీడీపీఓ నిర్మల జ్యోతి మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు చిన్నారులు, కిషోర్ బాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. రక్తహీనత నివారణకు విటమిన్లు ప్రోటీన్లు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. మహిళలు కిశోర బాలికల్లో రక్తహీనత శాతాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉప సర్పంచ్ రెడ్డి సుబ్బారావు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎన్ఎం పుల్లమ్మ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, సూపర్వైజర్ వెంకటమ్మ అంగన్వాడీ టీచర్లు ప్రభావతి, దమయంతి, అన్నపూర్ణ, నాగేలక్షి , పద్మ కుమారి, యశోద, ఆయాలు తల్లులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ వ్యక్తిత్వ నిపుణుడి అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



**ఎర్రుపాలెం, ప్రజా జ్యోతి** మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్ గా పనిచేస్తున్న గడ్డమానుగు రామారావు కు కాకతీయ యూనివర్సిటీ లో రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్, ఎన్ఎస్ఎస్. పిఓ రాంబాబు, సీనియర్ అధ్యాపకులు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ మన కళాశాలకు చెందిన అధ్యాపకులు రామారావు కి అవార్డు రావడం కళాశాలకు దక్కిన గౌరవం అని మునుముందు మరెన్నో అవార్డ్స్ పొంది మన కాలేజీకి మన ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

## రిపోర్టర్ సత్యానందం కుటుంబానికి అండగా చింతకాని ప్రెస్ క్లబ్

- సత్యానందం కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన చింతకాని జర్నలిస్టులు



**బోనకల్, సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన జర్నలిస్టు మందా సత్యానందం ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల చింతకాని మండల ప్రెస్ క్లబ్ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, సమాజ సేవలో తనదైన ముద్ర వేసిన సత్యానందం మరణం జర్నలిస్టు లోకానికి తీరని లోటని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సత్యానందం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ చింతకాని మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో జర్నలిస్టు కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యత అని ప్రెస్ క్లబ్ సభ్యులు తెలిపారు.మృతుడు సత్యానందంతో ఉన్న వృత్తిపరమైన అనుబంధం, స్నేహబంధం నేపథ్యంలో బోనకల్ మండలానికి చెందిన తోటి విలేకరులు కూడా కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులను ఓదార్చారు. జర్నలిస్టులు తేనె వెంకటేశ్వర్లు, దేగల వేలాద్రి, ఎస్.కె. బడే సాహెబ్ సత్యానందం సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో చింతకాని మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షురాలు జొన్నలగడ్డ మల్లీశ్వరి, అంబటి శాంతయ్య, గుడిద పిచ్చయ్య, సురేష్ శెట్టి, గడ్డం విజయ్, గండారపు రామారావు, వేర్పుల కోటేశ్వరరావు, వెన్నబోయిన సురేందర్, గంటల తిరుపతాచారి, చాపలమడుగు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## యూనిక్ పోల్ నంబరింగ్తో విద్యుత్ అంతరాయాలపై వేగవంతమైన స్పందన

- ఎస్ఈ









**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు సాంకేతికతను అందిపుచ్చుకుం టూ, అందుకు అనుగుణంగా మరింత మె రుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని. ఖమ్మం.సర్కిల్,.సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు.అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్లో భాగంగా 33 కేవీ, 11 కేవీ విద్యుత్ స్తంభాలకు యూనిక్ పోల్ నంబర్లను కేటాయిం చి పెయింటింగ్ ప్రక్రియపూర్తి చేశామని తెలిపారు. ఇప్పటి వరకు 33 కేవీ పోల్ నంబరింగ్ 56 No's ఫీడర్లు పూర్తి కాగా, 11 కేవీ పోల్ నంబరింగ్ 551 No's ఫీడర్లు పూర్తయిందని వెల్లడించారు.విద్యుత్ లైన్లలో ఎక్కడైనా సమస్య లేదా అంతరాయం ఏర్పడినప్పుడు యూనిక్ పోల్ నంబర్ ఆధారంగా సంబంధిత స్తంభం ఉన్న ఖచ్చితమైన లొకేషన్ను మ్యాపింగ్ ద్వారా వెంటనే గుర్తించి, సిబ్బందిని అక్కడికి పంపించి సమస్యను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు. దీనివల్ల విద్యుత్ అంతరాయాల వ్యవధిని గణనీయంగా తగ్గించి వినియోగదారులకు వేగవంతమైన సేవలు అందించవచ్చని పేర్కొన్నారు.యూనిక్ పోల్ నంబరింగ్ ద్వారా 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్ల నిర్వహణ మరింత క్రమబద్ధంగా చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.యూనిక్ పోల్ నంబర్ల ఆధారంగా విద్యుత్ లైన్లను సిబ్బందికి క్రమబద్ధంగా కేటాయించి, దశలవారీగా నిర్వహణ పనులు చేపట్టడంతో పాటు చేపట్టిన పనుల వివరాలను సులభంగా నమోదు చేసి పర్యవేక్షించవచ్చన్నారు.విద్యుత్ లైన్ల నిర్వహణలో పారదర్శకత, వేగం, సమర్థతను పెంచడంతో పాటు విద్యుత్ అంతరాయాలను గణనీయంగా తగ్గించడంలో యూనిక్ పోల్ నంబరింగ్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు.

## చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

- రాష్ట్ర కన్వీనర్ గా తలుపుల విజయబాబు




**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వీరనారి చిట్యాల ఐలమ్మ 131 వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించే భాగంలో ఏర్పాటు చేసిన కమిటీలు మండల పరిధిలోని తక్కెళ్ళ పాడు గ్రామానికి చెందిన తలుపుల విజయబాబుని రాష్ట్ర కమిటీ కన్వీనర్ గా నియమించారు ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ నా మీద నమ్మకం ఉంచి సాకలి ఐలమ్మ 131 జయంతి వేడుకల కన్వీనర్ గా నియమించిన రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క కి రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వర రావు కి రాష్ట్ర రజక వాషర్ మాన్ ఫెడరేషన్ చైర్మన్ అజయ్ బాబు కి వైస్ చైర్మన్ బంగారు బాబు కి తెలంగాణ రజక సేవా సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు తమరు బ్రహ్మయ్య కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలు నేడు మధ్యాహ్నం రెండు గంటలకు రవీంద్ర భారతిలో జరిగే కార్యక్రమానికి రజకులు ఐలమ్మ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరినాడు.

## మధిరలో ఘనంగా నున్న నవీన్,నిహారికల కుమారుడి ఉయ్యాల వేడుక

- హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం



**మధిర ప్రజా జ్యోతి** మధిర మున్సిపాలిటీ పరిధి ఇల్లిందలపాడులో శుక్రవారం నున్న నవీన్,నిహారిక దంపతుల కుమారుడి ఉయ్యాల వేడుక వైభవంగా జరిగింది.ఇల్లందులపాడు గ్రామానికి చెందిన తెల్లస్వామి వాణి మనవడైన ఈ చిన్నారి వేడుకకు ఇరు కుటుంబాల బంధుమిత్రులు,శ్రేయోభిలాషులు హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆమెతో పాటు కాంగ్రెస్ నాయకులు సూర్యదేవర కోటేశ్వరరావు,దిరిశాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారికి ఆశీస్సులు అందజేశారు.

## మాదారంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం

- మాధరం సర్పంచ్ ఉమా నరేష్




**కారేపల్లి, సెప్టెంబర్ 24, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని మాదారం గ్రామ పంచాయతీలో గణేష్ నిమజ్జనం – స్వచ్ఛతా హీ సేవా 2026 కార్యక్రమాన్ని ప్రజల సహకారంతో ప్రశాంతంగా, సురక్షితంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించడం జరిగిందని సర్పంచ్ ఉమా నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు . ఆమె మాట్లాడుతూ నిమజ్జన కార్యక్రమంలో భక్తులు ప్రజలకు అవసరమైన సహకారం అందిస్తూ, పారిశుధ్యం, భద్రత పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. నిమజ్జనం అనంతరం నిమజ్జన ప్రదేశంలో మిగిలిపోయిన పూజా సామగ్రి, వ్యర్థాలు తదితరాలను తొలగించి పరిసరాలను శుభ్రపరిచాము. అలాగే స్వచ్ఛతా హీ సేవా–2026 కార్యక్రమంలో భాగంగా మాదారం గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువు,కుంటలను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టడం జరిగింది. చెరువు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు మరియు ఇతర అనవసర వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా "స్వచ్ఛమైన గ్రామం – ఆరోగ్యకరమైన గ్రామం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, నీటి వనరులను పరిశుభ్రంగా కాపాడుకోవాల్సిన బాధ్యతపై అవగాహన కల్పించడం జరిగింది. గ్రామ ప్రజల సహకారం, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పారిశుధ్య సిబ్బంది కృషితో గణేష్ నిమజ్జనం స్వచ్ఛతా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయని ఆమె పేర్కొంది.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ విజయ్, ఇందిరమ్మ డైరెక్టర్ నరేష్ కుమార్, పంచాయతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రీస్కూల్ విద్య చిన్నారులకు బలమైన పునాది

- అంగన్వాడి సిడిపిఓ కృష్ణ శ్రీ



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని బనిగండ్లపాడు అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం మాస ఉత్సవంలో భాగంగా బాల్యా రంభ దశ మరియు ప్రీస్కూల్ విద్యపై సిడిపిఓ కృష్ణ శ్రీ మాట్లాడుతూ ప్రీస్కూల్ విద్యపై ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తు. చిన్నారుల వయస్సుకు అనుగుణంగా ఆటలు, పాటలు, కథలు, చిత్రలేఖనం, అభ్యాస కార్యక్రమాల ద్వారా విద్యాబోధన చేపడుతున్నమని. దీంతో పిల్లల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తి, భాషా నైపుణ్యాలు, సామాజిక అవగాహన పెంపొందుతాయి అని కావున తల్లిదండ్రులు తమ పిల్లలందరినీ అంగన్వాడి కేంద్రానికి పంపించాలని అంగన్వాడి కేంద్రాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని వనరులు ఉపయోగించుకోవాలని అంగన్వాడీలో చేర్చడం ద్వారా పిల్లలకి ప్రీ స్కూల్ పాఠ్యాంశాలు భవిష్యత్తులో వారికి ఉపయోగపడతాయని ప్రీ స్కూల్ విద్య చిన్నారులకు బలమైన పునాది అని సిడిపిఓ కృష్ణ శ్రీ పేర్కొన్నారుపేర్కొన్నారు . ఇదే సందర్భంలో అంగన్వాడి సూపర్వైజర్ సరిత మాట్లాడుతూ పాఠశాలలో చేరకముందే పిల్లలకు విద్యపై ఆసక్తి కలిగించడం, ఇతరులతో కలిసిమెలిసి ఉండేలా చేయడం ప్రీస్కూల్ విద్య ప్రధాన లక్ష్యమని చిన్నారుల భవిష్యత్ విద్యాభ్యాసానికి ప్రీస్కూల్ విద్య బలమైన పునాదిగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ గద్దల మేరీ జ్యోతి బొగ్గుల ఉమామహేశ్వరి ముచ్చింతల మహాలక్ష్మి దాసరి మేరీకాంతం అంగన్వాడి ఆయాలు అంగన్వాడి పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు

# యూరియా బస్తాకు ఓ హామీ.. ఫోన్‌పేకు మరో దారి!

(మొదటి పేజీ తరువాయి...)

ప్రాధాన్యం ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం 'ఆధార్ వద్దు.. ఫోన్‌పే చాలు' అన్న హామీ వినిపించిందంటూ రైతు ఆరోపించడం చర్చనీయాంశంగా మారింది. బస్తా ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరి పేరుతో వచ్చింది? ఎవరికి ఇచ్చారు? ఎంత ఇచ్చారు? చెల్లింపు ఎలా జరిగింది? అన్న ప్రశ్నలకు రికార్డులే సమాధానం చెప్పాల్సి ఉంది.

రైతు మాత్రం తనకు కావాల్సింది యూరియానేనని.. వ్యవసాయ శాఖ రికార్డుల లెక్కలు తనకు తెలియవని చెబుతున్నాడు. దీంతో అసలు లెక్క ఎవరి దగ్గరుందో, ఏ రిజిస్టరులో ఉందో, ఏ నమోదు పుస్తకం ఏం చెబుతుందో అధికారుల పరిశీలనతోనే తేలాల్సి ఉంది.

### మరోవైపు రూ.లక్ష వ్యవహారం!

బచ్చోడు గ్రామానికి చెందిన మరో వ్యక్తి కూడా తన వద్ద నుంచి సుమారు రూ.లక్ష తీసుకున్నారని, ఇప్పటివరకు తిరిగి ఇవ్వలేదని ఆరోపిస్తూ ముందుకొచ్చాడు. డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఒకవైపు యూరియా బస్తాల హామీ.. మరోవైపు నగదు వ్యవహారంపై ఆరోపణలు.. దీంతో గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారుల వ్యవహారశైలిపై చర్చ మొదలైంది. అయితే నగదు తీసుకున్నారనే ఆరోపణకు సంబంధించిన పూర్తి వివరాలు, లావాదేవీ ఉద్దేశం, బాధ్యత ఎవరిదన్నది అధికారికంగా తేలాల్సి ఉంది.




### సేల్స్‌మన్ పాత్రపైనా 'లెక్క' అడుగుతున్న రైతులు

ఇక యూరియా పంపిణీ వ్యవహారంలో సంబంధిత వ్యవసాయ సేల్స్‌మన్ పాత్రపైనా రైతులు ప్రశ్నలు సంధిస్తున్నారు. రైతుల పేర్లు, రసీదులు లేదా ఇతర సంబంధిత నమోదు వివరాలు లేకుండానే యూరియా పంపిణీ జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 'బస్తా వచ్చింది.. ఎక్కడికి వెళ్లింది?' అన్న ప్రశ్నకు రికార్డులు సమాధానం చెప్పాల్సి ఉండగా.. 'రైతుకు ఇచ్చాం' అంటే ఎవరి పేరుతో ఇచ్చారు? అన్నది మరో ప్రశ్నగా మారుతోంది. ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంతన్నది నిల్వ రిజిస్టర్లు, పంపిణీ వివరాలు, రైతుల నమోదు, రసీదులు పరిశీలిస్తే తేలిపోనుంది.

### ఏఈఓ హామీ.. సేల్స్‌మన్ సహకారం?

ఏఈఓపై వస్తున్న ఆరోపణలకు తోడు సేల్స్‌మన్‌పై కూడా యూరియా పంపిణీకి సంబంధించి ఆరోపణలు రావడంతో ఇద్దరి మధ్య సమన్వయం ఉందా? అనే ప్రశ్నలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. అయితే ఇద్దరూ కలిసి రైతులను మోసం చేశారనే విషయం ఇప్పటివరకు నిర్ధారణ కాలేదు. ఇది ప్రస్తుతం బాధితులు చేస్తున్న ఆరోపణల స్థాయిలోనే ఉంది. నిజంగా సమన్వయం ఉంటే దాని ఆనవాళ్లు రికార్డుల్లో కనిపించాల్సిందే. లేకపోతే ఆరోపణలు ఎందుకు వస్తున్నాయన్నదానికీ అధికారులు సమాధానం చెప్పాల్సిందే. అందుకే ఈ వ్యవహారంలో మాటలకంటే పత్రాలే ముఖ్యమని రైతులు అంటున్నారు.

### బచ్చోడు నుంచి బీరోలు.. ఎలువారిగూడెం వరకు

ఇప్పటికే బచ్చోడు గ్రామం నుంచి బాధితులు ముందుకొస్తుండగా.. బీరోలు, ఎలువారిగూడెం గ్రామాల నుంచి కూడా ఏఈఓ వ్యవహారంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కొక్కరిగా బాధితులు తమ వద్ద ఉన్న వివరాలు, పత్రాలు, సంభాషణల గురించి వెల్లడిస్తున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 'ప్రజాజ్యోతి'లో కథనం వెలువడిన తరువాత మరికొందరు బాధితులు బయటకు వస్తున్నారని వారు చెబుతున్నారు. అయితే ప్రతి ఆరోపణను విడివిడిగా పరిశీలించి, అందుబాటులో ఉన్న ఆధారాలను ధృవీకరించిన తరువాతే వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది.

### ఇప్పుడు అధికారుల లెక్కే కీలకం!

యూరియా నిల్వలు ఎంత వచ్చాయి? ఎంత పంపిణీ అయ్యాయి? ఎవరెవరికి ఇచ్చారు? రైతుల పేర్లు నమోదు చేశారా? రసీదులు ఉన్నాయా? చెల్లింపులు ఏ విధంగా జరిగాయి? సేల్స్‌మన్ వద్ద ఉన్న రికార్డులు ఏమి చెబుతున్నాయి? ఏఈఓకు యూరియా పంపిణీలో ఉన్న అధికారిక పరిధి ఎంత? అన్న ప్రశ్నలకు వ్యవసాయ శాఖ సమాధానం ఇవ్వాల్సి ఉంది. రైతుకు కావాల్సింది యూరియా.. అధికారులకు కావాల్సింది రికార్డు.. మరి ఈ రెండింటి మధ్య 'ఫోన్‌పే' ఎక్కడి నుంచి వచ్చిందన్నది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. ఆరోపణలు నిజమా? అపార్థమా? లేక రికార్డుల గందరగోళమా? అన్నది సమగ్ర విచారణతోనే తేలనుంది. బాధితులు చెబుతున్న ఆరోపణలు, వారు చూపిస్తున్న ఆధారాలు, యూరియా పంపిణీ రికార్డులు, సంబంధిత అధికారుల వివరణ.ఈ నాలుగూ వెలుగులోకి వస్తేనే పూర్తి వాస్తవం బయటపడనుంది. ఈ ఆరోపణలపై ఏఈఓ బానోత్ కళ్యాణ్, సంబంధిత సేల్స్‌మన్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల అధికారిక స్పందన రావాల్సి ఉంది.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు

- ఏడీఈ ఆదేశాలతో గ్రామాల్లో కదిలిన విద్యుత్ శాఖ యంత్రాంగం





**వేంసూరు సెప్టెంబర్ 25 ప్రజాజ్యోతి** వేంసూరు: మండలంలోని గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారంపై విద్యుత్ శాఖ అధికారులు దృష్టి సారించారు. విద్యుత్ శాఖ ఏడీఈ ప్రసాద్‌బాబు ఆదేశాల మేరకు ఏఈ అంకారావు ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలతో పాటు మిడిల్ పోల్స్, త్రీఫేజ్ విద్యుత్ సరఫరా, తక్కువ వోల్టేజ్, సరఫరా అంతరాయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. కందుకూరు, దుద్దేపూడి, వి.వెంకటాపురం, లచ్చన్నగూడెం, భరణిపాడు, మర్లపాడు, లింగపాలెం తదితర గ్రామాల్లో విద్యుత్ లైన్లు, స్తంభాలు, తీగల పరిస్థితిని అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, వేలాడుతున్న తీగలను గుర్తించి అవసరమైన చోట్ల మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, విద్యుత్ లైన్ల నిర్వహణ, స్తంభాలు–తీగల భద్రత, తక్కువ వోల్టేజ్ సమస్యల పరిష్కారంతో పాటు నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. లైన్‌మెన్లు, ఇతర సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నారు. గ్రామాల్లో విద్యుత్‌కు సంబంధించిన ఏ సమస్య ఉన్నా ప్రజలు, రైతులు వెంటనే విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని ఏడీఈ ప్రసాద్ బాబు, ఏఈ అంకారావు సూచించారు. సమస్యలను గుర్తించిన వెంటనే పరిష్కరించేందుకు శాఖ తరపున చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

## అంగన్వాడీ సిబ్బందికి సన్మానం

**వేంసూరు సెప్టెంబర్ 25 ప్రజాజ్యోతి** భరత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి 76 వ జన్మదినోత్సవాల్లో భాగం గా సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగం గా ఈరోజు వేంసూరు మండల అధ్యక్షులు గొర్ల ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వేంసూరు మండల చౌడవరం గ్రామం లోని 2 అంగన్వాడీ కేంద్రంలోని సిబ్బందిని సన్మానించుకోవటం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ ఖమ్మం జిల్లా కార్యదర్శి పాల నాగ సురేంద్ర రెడ్డి ,మండల ప్రధాన కార్యదర్శిలు యామరపు అప్పారావు, బండి వెంకటరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా కార్యాలయ సంయుక్త కార్యదర్శి గొర్ల శ్రావణ్ కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు భీమిరెడ్డి బాలకృష్ణ రెడ్డి, దొడ్డపనేని కృషయ్య, sc మోర్చా మండల అధ్యక్షులు కిన్నెర మహేష్ ,మహిళా మోర్చా మండలాధ్యక్షురాలు భీమిరెడ్డి సతీ అనసూయదేవి, గిరిజన మోర్చా మండలాధ్యక్షులు మూడు సీతారాములు ,బీజేపీనాయకులు,కార్యకర్తలు,గ్రామస్థులు పాల్గొన్నారు.



# వైరా రోడ్‌లోని ధన్య జాన్ ముజ్జుకోని దేవాలయం 11వ వార్షికోత్సవం

- ముఖ్యఅతిథిగా మహా ఘనత శ్రీశ్రీశ్రీ డాక్టర్ సగిలి ప్రకాష్
- భక్తిశ్రద్ధలతో దివ్యబలి పూజ సమర్పణ



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం వైరా రోడ్‌లో వేంచేసియున్న ప్రసిద్ధ జాన్ ముజుకుని దేవాలయం 11వ వార్షికోత్సవ మహోత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగాయి. దేవాలయం విచారణకర్తలు ఫాదర్ గొర్రె ముచ్చు సురేష్ నేతృత్వంలో ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.

**›› మహాఘనత వహించిన శ్రీ శ్రీ శ్రీ సగిలి ప్రకాష్ దివ్యబలిపూజ:**

ఈ వార్షికోత్సవ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం పీఠాధిపతులు (బిషప్) మహాఘనత వహించిన శ్రీ శ్రీ శ్రీ డా సగిలి ప్రకాష్ విచ్చేసి, ప్రత్యేక దివ్యబలిపూజ సమర్పించారు.అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ దేవాలయం నామకరణ కర్తయైన జాన్ మంజుకొని త్యాగనిరతి,గొప్ప జీవిత చరిత్రను, ఆయన చూపిన దైవమార్గాన్ని వివరించారు. సత్యం,విశ్వాసం, దైవభక్తి కలిగి జీవించడమే దేవునికి నిజమైన ఆరాధన అని పిలుపునిచ్చారు.

**›› అంగరంగ వైభవంగా వేడుకలు:**

దేవాలయం విచారణకర్తలు ఫాదర్ గొర్రెముచ్చు సురేష్ విశేష కృషి,పర్యవేక్షణలో చర్చ్ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలు,రంగురంగుల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. దైవజనులు,సువార్తికులు, కతోలిక విశ్వాసులు, మహిళలు, యువకులు హాజరై ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. కార్యక్రమ చివర్లో భక్తులందరికీ ఆశీర్వచనాలు అందించగా, విచారణకర్తలు ఫాదర్ గొర్రె మ చ్చు సురేష్ ఆధ్వర్యంలో విచ్చేసిన పెద్దల కు, భక్తులకు వందన సమర్పణ చేశారు.

## యూపీఐ ఛార్జీల నిర్ణయాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వెంటనే. ఉపసంహరించుకోవాలి


- ప్రజలు, చిరు వ్యాపారులపై అదనపు భారం మోపడం మోడీ ప్రభుత్వం మానుకోవాలి
- సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి



**మధిర. ప్రజా జ్యోతి** నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో డిజిటల్ చెల్లింపులపై అదనపు భారం మోపే విధానాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి డిమాండ్ చేశారు.దేశంలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు వ్యాపారి లావాదేవీలపై యండిఆర్ విధించే విధానాన్ని తీసుకురావడం చిన్న వ్యాపారులు, చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులపై అదనపు ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రకటించిన కొత్త విధానంలో ₹2,000 పైబడిన నిర్దిష్ట వ్యాపారి లావాదేవీలకు ఎండిఆర్ వర్తిస్తుందని తెలిపారు. ఇప్పటికే పెరుగుతున్న ధరలు, పన్నులు, వ్యాపార నిర్వహణ ఖర్చులతో సతమతమవుతున్న చిన్న వ్యాపారులపై మరో రకమైన చెల్లింపు భారం మోపడం సమంజసం కాదన్నారు. ఈ ఖర్చు చివరకు వస్తువుల ధరల పెరుగుదల రూపంలో వినియోగదారులపై పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.డిజిటల్ ఇండియా పేరుతో ప్రజలను, చిన్న వ్యాపారులను భారాల బాట పట్టించవద్దని మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూపీఐ వంటి ప్రజలకు ఉపయోగపడే డిజిటల్ చెల్లింపు వ్యవస్థను పూర్తిగా ఉచితంగా కొనసాగించడంతో పాటు, చిన్న వ్యాపారులపై ఎలాంటి ఎండిఆర్ భారం లేకుండా స్పష్టమైన హామీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులను అందజేత



**రఘునాథపాలెం, ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం గణేశ్వరం, కొర్లబోడు తండా గ్రామాల్లో శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో, ఆయన ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులను అందజేశారు.గణేశ్వరంలో సర్పంచ్ భుక్య నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ వల్లూరి శ్రీనివాసరావు చెక్కులు పంపిణీ చేయగా, కొర్లబోడు తండాలో సర్పంచ్ చిన్నయ్య నాయక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుగులోత్ నాగేష్, వార్డు సభ్యురాలు భూక్యా స్వాతి భాస్కర్, దరవత్ విష్ణు, భూక్యా వినోద్, గ్రామశాఖ అధ్యక్షుడు గాజుల రమేష్, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## నర్సింగ్ విద్యార్థి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

- ఐద్వా డిమాండ్.



**కారేపల్లి, సెప్టెంబర్ 25, ప్రజా జ్యోతి :** ఖమ్మం నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న ఇంద్రపల్లి హరిణి (18) మృతికి కారణమైన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా మహిళా సంఘం మండల కార్యదర్శి కొండబోయిన ఉమావతి డిమాండ్ చేశారు.శుక్రవారం సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ. ఖమ్మంలో నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ చదువుతు సెలవుల నిమిత్తం హరిణి తన స్వగ్రామమైన జూలూరుపాడు మండలం వెంకటాపురం గ్రామానికి వెళ్లిందన్నారు. ఆమె తల్లి కూలి పనికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి బాత్రూం వెనుక భాగంలో హరిణి నిర్జీవంగా శవమై పడి ఉండటాన్ని గుర్తించారని తెలిపారు. హరిణి ఒంటిపై గాయాలు, రక్తపు మరకలు, దుస్తులు చిరిగిపోయి ఉండటంతో ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. హరిణి మృతికి గల కారణాలను సమగ్రంగా దర్యాప్తు చేసి, హంతకులను గుర్తించి తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఉమావతి డిమాండ్ చేశారు.దేశంలో బాలికలు, మహిళలపై హత్యలు, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, ప్రేమ పేరుతో మైనర్ బాలికలను మోసం చేయడం వంటి ఘటనలు రోజు రోజు కు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దిశ, నిర్భయ, పోక్సో వంటి చట్టాలు ఉన్నప్పటికీ మహిళలు, బాలికలపై అఘాయిత్యాలను పూర్తిగా అరికట్టడంలో అధికార యంత్రాంగం, పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

## కొత్త చెరువు-జీకే బంజారా రహదారి పనులకు శంకుస్థాపన

**రఘునాథపాలెం ప్రజా జ్యోతి :** మండలంలోని పాపటపల్లి తండా నుంచి కొత్త చెరువు మీదుగా జీకే బంజారా వరకు రూ.25 లక్షలతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు పనులకు శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లుగా రహదారి ఇబ్బందులతో రైతులు, మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించనుంది. రహదారి పూర్తయితే పాపటపల్లి–జీకే బంజారా మధ్య రాకపోకలు సులభతరం కానున్నాయి. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ద్రాక్ష వతి, వెంకట్ నారాయణ,ఉపసర్పంచ్ లక్ష్మి, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ లక్ష్మణ్ గౌడ్, తగరం రవీందర్,ఏలేశ్వరావు,కొండయ్య,దస్తగిరి,దంతాల రాజు ఉపేందర్,భద్రయ్య,లాలు, వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్ జయంతి వేడుకలు



**మధిర ప్రజా జ్యోతి** ఏకాత్మ మానవతావాద సిద్ధాంత ప్రదాత, మహోన్నత జాతీయవాది, భారతీయ జనసంఘ్ పూర్వ అధ్యక్షులు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులుఅంత్యోదయమే లక్ష్యంగా, సమాజంలోని చివరి వ్యక్తి సంక్షేమమే దేశ అభివృద్ధికి కొలమానంగా భావించిన మహనీయుడు దీనదయాళ్ ఉపాధ్యాయ్ భారతీయ సంస్కృతి, జాతీయత మానవీయ విలువల ఆధారంగా దేశాన్ని నిర్మించాలన్న వారి ఆలోచనలు నేటికీ కోట్లాది మందికి స్ఫూర్తినిస్తున్నాయి "సమాజంలోని చివరి వ్యక్తి ముఖంలో చిరునవ్వు పూయించడమే నిజమైన అభివృద్ధి" అనే అంత్యోదయ స్ఫూర్తితో ముందుకు సాగడమే వారికి మనం అందించే నిజమైన నివాళివారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే సంకల్పంతో ముందుకు సాగుదాం పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్ కి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారుఈ కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ నాయకులు స్థానిక ఎస్సీ కాలనీ ఉన్న అంగన్వాడి స్కూల్ సందర్శించి అక్కడ ఉన్నటువంటి పిల్లలు బాలింతలు గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న పోషక ఆహారాన్ని పరిశీలించి పిల్లలతో వాళ్లకు వచ్చినటువంటి బొమ్మలు గీయించి వాళ్ళకి చిన్న బహుమతులు ఇవ్వడం జరిగింది మధిర పట్టణ అధ్యక్షుడు శివరాజు సుమంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మర్సకట్ల స్వర్ణాకర్ బీజేపీ జిల్లా కార్యదర్శి రామిశెట్టి నాగేశ్వరరావు బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పాపట్ల రమేష్ నేను సీనియర్ జిల్లా నాయకులు చిలువేరు సాంబశివరావు మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భవాని జిల్లా కార్యదర్శి దోర్నాల రవీంద్ర పట్టణ ప్రధాన కార్యదర్శి బియ్యవరపు రామకృష్ణ మహిళా నాయకురాలు ఆలేటి మేరి తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ గురుకులంలో జిల్లా అధికారి తనిఖీ

- హాస్టల్, తరగతి గదులు, వసతి సౌకర్యాల పరిశీలన
- విద్యార్థుల భవిష్యత్‌పై దిశానిర్దేశం



**కారేపల్లి, సెప్టెంబర్ 25, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లిలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను ఖమ్మం జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్ గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.గురుకులంలో ని హాస్టల్,స్టాక్ రిజిస్టర్, ఆహార పట్టిక,ఆహార పదార్థాలు,తరగతి గదులు, మూత్రశాలలు,డార్మెటరీలు, విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో మాట్లాడిన మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్ విద్య ప్రాముఖ్యతను వివరించారు.విద్యార్థులు తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని సూచించారు. నిరంతర కృషి,పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు.అదేవిధంగా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యత,వసతి ఏర్పాట్లపై సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.గురుకులంలో విద్యార్థులకు మెరుగైన వసతులు,నాణ్యమైన విద్య అందేలా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపల్ దార సావిత్రి, ఉపాధ్యాయులు,వార్డెన్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.